క్లుప్తంగా

దీపారాధన స్టాండ్ బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవస్థానానికి పెనుబల్లి గ్రామానికి చెందిన ప్రముఖ పర్వతారోహకుడు కె.సూర్యప్రకాష్ రూ.1.50 లక్షల విలువ చేసే దీపారాధన స్టాండ్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయతో ఇప్పటివరకు ఏడు పర్వతాలను అధిరోహించానని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పర్వతాలను ఎక్కేందుకు కృషి చేస్తానని వివరించారు. కార్యక్రమంలో సూర్యప్రకాష్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



నెల్లూరు(అర్బన్): రక్తదానంతో ప్రాణాలను కాపాడవచ్చని వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఐటీఐ విద్యార్థులు 60 మందికిపైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

వర్ధన్‌రెడ్డి విద్యార్థుల ప్రతిభ



నెల్లూరు(అర్బన్): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నగరంలోని వర్ధన్‌రెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని ఆ విద్యా సంస్థల చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాలలో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఐటీ-నీట్ అకాడమీ విద్యార్థిని అర్షియా 99.45 పర్సంటైల్‌తో ఆల్‌ఇండియా ర్యాంకు 1239 సాధించిందని తెలిపారు. వెంకటశ్రీనాథ్ 90.83, లలిత్‌కుమార్ 88.09, జ్యోత్స్నప్రియ 87.47, అబ్దుల్‌హఫీజ్ 86.09 పర్సంటైల్ సాధించారని వివరించారు. 50 శాతానికి పైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని తెలిపారు. ప్రిన్సిపల్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లను పెంచాలి



మాట్లాడుతున్న డీఈఈ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సిబ్బంది డీలిస్టులపై ప్రత్యేక దృష్టి సారించి రెవెన్యూ వసూళ్లను పెంచాలని నెల్లూరు టౌన్-2 డీఈఈ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని జనార్దన్‌రెడ్డికాలనీలో నూతన ఏర్పాటు చేసిన విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహిస్తూ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలని సూచించారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున విద్యుత్ సిబ్బందితో పాటు అవుట్ సోర్సింగ్, షిఫ్ట్ ఆపరేటర్లు రాజకీయ సమావేశాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఇంజినీర్ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్‌సేవ

నెల్లూరు(బృందావనం): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి ఊంజల్‌సేవను నేత్రపర్వంగా శుక్రవారం నిర్వహించారు. ఉభయకర్తగా అమర్తలూరు భాస్కర్, అరుణ దంపతులు వ్యవహరించారు. ఈఓ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.

- మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో వెణ్ణత్తాళి ఉత్సవం, అశ్వవాహనసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా దోనిపర్తి గిరిప్రసాద్, వాణి దంపతులు, మాలకొండారెడ్డి దంపతులు వ్యవహరించారు.
- శబరి శ్రీరామక్షేత్రంలో ఏకాంతసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా అన్నం దయాకర్‌గౌడ్, సుబ్బరత్నమ్మ దంపతులు వ్యవహరించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ఏకాంతసేవతో ముగిశాయి. ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, అభిషేకం, చతుర్వేదపారాయణం విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా ఇడపలపాటి వెంకటేశ్వర్లు, ఇడపలపాటి శ్రీనివాసరావు, ఇడపలపాటి కోటేశ్వరరావు దంపతులు వ్యవహరించారు. ఆలయ పాలక మండలి అధ్యక్ష,కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, ఎస్వీ రత్నం పర్యవేక్షించారు.

హామీలు నిలబెట్టుకున్న ఏకైక సీఎం జగన్



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు : ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని పేదలకు మేలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లో పేరు తెచ్చుకున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మామిడిపూడి, తాళ్లపూడి గ్రామాల్లో మంత్రి కాకాణి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతినెలా ఒకటో తేదీన ఠంఛన్‌గా వలంటీర్ల ద్వారా వృద్ధులకు పింఛన్లను అందజేసిన ఘనత సీఎం జగన్‌దే అని పేర్కొన్నారు. అయితే చంద్రబాబు వలంటీర్ల వ్యవస్థపై పగబట్టి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో వృద్ధుల ఇంటికి వెళ్లి పింఛన్లను అందజేయడం లేదన్నారు. దీంతో వారిని మంచాలపై మోసుకెళ్లి పింఛన్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇందుకు చంద్రబాబు కారణమని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ నేరుగా బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేసినట్లు చెప్పారు.

మంత్రిగా సోమిరెడ్డి ఏమి చేశాడో చెప్పాలి

సోమిరెడ్డి గతంలో తనపై ఓడిపోయినా మంత్రయ్యారని, అయితే మంత్రిగా ఏమి చేశాడో చెప్పుకోలేని పరిస్థితిలో ఆయన ఉన్నట్లు మంత్రి కాకాణి విమర్శించారు. మామిడిపూడి, తాళ్లపూడి గ్రామాల్లో ఏమి అభివృద్ధి పనులు చేశాడో చెప్పాలన్నారు. ఎక్కడికి వెళ్లినా సీఎం జగన్‌ను, మంత్రిగా ఉన్న తనను తిట్టిపోస్తున్నట్లు తెలిపారు. ఒక్కసారి గెలిపించాల్సిందిగా సోమిరెడ్డి కోరుతున్నాడని, ఎందుకు గెలిపించాలో ప్రజలు ఆయన్ను అడిగితే సమాధానం లేదన్నారు. కరోనా సమయంలో ఎక్కడ దాక్కున్నాడో అడిగితే సమాధానం లేదన్నారు. అందరి పేర్లు పరిశీలించిన తర్వాత సోమిరెడ్డికి టికెట్ ఇచ్చినట్లు స్వయాన చంద్రబాబు వెల్లడించాడని, దీనిని బట్టి చూస్తే సోమిరెడ్డి ఎంత బలహీనుడో అర్థమవుతోందన్నారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణమ్మ, సర్పంచ్ మస్తానమ్మ, నాయకులు పెమ్మారెడ్డి శ్రీనివాసులురెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజలే మా సైనికులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్న, పక్కన ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ప్రజలే మా గెలుపునకు బాటలు వేసే సైనికులు అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాగులపాడు గ్రామంలో శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాగులపాడు గ్రామ సచివాలయ పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు రూ.16.27 కోట్లు అందిందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్, సీఎస్సార్ నిధులు రూ.కోటి నిధులతో గ్రామంలో సీసీరోడ్లు వేయించామని పేర్కొన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.14 లక్షలు వెచ్చించి తాగునీరు అందిస్తున్నామని వివరించారు. ఇలా గ్రామంలో అనేక అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగాయని తెలిపారు. ఇంకా ఏవైనా పెండింగ్ పనులు, చేయాల్సిన అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తామని వివరించారు. టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి కేవలం నగదే ప్రధానంగా భావించి ప్రజలను కొనాలని చూస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. మే 13న జరిగే ఎన్నికల్లో నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గ అభివృద్ధి సాధకుడు ప్రసన్నకుమార్‌రెడ్డి అని తెలిపారు. జిల్లాలో కోవూరు నియోజకవర్గాన్ని ప్రసన్న ఆదర్శవంతంగా తీర్చిదిద్దారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండతో అనేక అభివృద్ధి పనులు చేసి ప్రజల మనిషి అనిపించుకున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ మారుతీదేవి

ముత్తుకూరు : రైతులు ఎడగారు సీజన్‌లో వరి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి సూచించారు. మండల కేంద్రంలో మునునూరువారిపాళెం, బ్రహ్మదేవి, దువ్వూరువారిపాళెం రైతులతో ఏడీఏ శుక్రవారం మాట్లాడారు. ఈ సందర్భంగా విత్తనాలు అందుబాటులో ఉంచడంపై రైతులతో చర్చించారు. ప్రత్యామ్నాయ పంటల కింద ఎలాంటి పంటలు సాగు చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓలు చక్రవర్తి, జ్యోత్స్నరాణి, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

గొలగమూడిలో మంత్రి ప్రచారం నేడు

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం గొలగమూడి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు గొలగమూడిలో, సాయంత్రం 4 గంటలకు అనికేపల్లి, కంటేపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం నేడు

కొడవలూరు : మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య శుక్రవారం తెలిపారు. ఉదయం 7 గంటలకు దామేగుంట, 9 గంటలకు వెంకన్నపురంలో ప్రచారం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు రామన్నపాళెం, మానేగుంటపాడు, ఆలూరుపాడులో ప్రచారం ఉంటుందని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

నాలుగు నామినేషన్ల తిరస్కరణ

వెంకటాచలం : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి మొత్తం 17 మంది నామినేషన్లు దాఖలు చేయగా, వారిలో నలుగురు నామినేషన్లను శుక్రవారం ఆర్వో చిన ఓబులేసు తిరస్కరించారు. మిగిలిన 13 మంది పోటీలో ఉన్నారు.

కూచిపూడి నృత్యకారిణికి సన్మానం



మనుబోలు : మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన కూచిపూడి నృత్యకారిణి పూర్ణిమను మనుబోలు ఎంపీటీసీ దువ్వూరు రాజేశ్వరమ్మ, సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఘనంగా సన్మానించారు. కోదండరామపురంలో శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయంలో గురువారం రాత్రి జరిగిన సీతారామ కల్యాణం సందర్భంగా పూర్ణిమ కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. పలుకే బంగారమాయేనా అనే పాటకు పూర్ణిమ ప్రదర్శించిన హావభావాలు, నృత్యం విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో పూర్ణిమను కార్యక్రమ నిర్వాహకులతో కలిసి వారు సన్మానించి అభినందించారు.

బుచ్చిలో టీడీపీ ఖాళీ



పార్టీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీలో 500 కుటుంబాల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ వలంటీర్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెం టౌన్, రూరల్ ప్రాంతాల్లో టీడీపీ దాదాపు ఖాళీ అయిపోయింది. వందల కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. మండలంలోని రామచంద్రాపురం, రాఘవరెడ్డికాలనీ, చలివేంద్రం, కట్టుబడిపాళెం, పెద్దూరు అరుంధతీయవాడకు చెందిన 500 కుటుంబాలు మండల పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రసన్న ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతిఒక్కరికీ పార్టీ కండువా వేసి ఆహ్వానం పలికారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని, తమ గ్రామాల్లో ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని నాగమాంబపురం గ్రామ పంచాయతీ పరిధిలో మాజీ వలంటీర్ గుల్జార్ శుక్రవారం కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల తనకు ఇష్టం లేకపోయినా కొందరు టీడీపీ నాయకులు బలవంతంగా వారి పార్టీ కండువా వేశారన్నారు. తాను టీడీపీలో చేరినట్టు ప్రకటించుకున్నారన్నారు. అందంతా అవాస్తవమని తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రసన్నకుమార్‌రెడ్డి గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వివరించారు.

సంక్షేమ పథకాలతోనే రాష్ట్రం సుభిక్షం



కొడవలూరు : తలమంచిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న చలపతిరావు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మధుసూదన్‌రెడ్డి

కొడవలూరు : సంక్షేమ పథకాల అమలుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. మండలంలోని తలమంచిలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం కోసం శుక్రవారం ఆయన ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాల కారణంగా అనేక మంది పేదలు అప్పుల బారిన పడకుండా జీవించగలుగుతున్నారన్నారు. గత ప్రభుత్వాలు పేదలను ప్రత్యేకంగా పట్టించుకోకపోవడంతో అప్పుల ఊబిలో చిక్కుకొని సతమతమయ్యేవారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పేదలు బాధ పడకూడదని అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారు గౌరవంగా జీవించేలా చేశారన్నారు. ఎన్నికల సమయంలో వచ్చే ప్రతిపక్ష నేతలను ప్రజలు నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ యాటగిరి భాస్కర్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆత్మకూరు వెంకట సతీష్, బైనా నాగరాజ, దాసరి వెంకటేశ్వర్లు, రాయపు వేణు తదితరులు పాల్గొన్నారు.

తలమంచిలో పెరిగిన బలం

మండలంలోని తలమంచికి చెందిన పారిశ్రామికవేత్త జొన్నా కళ్యాణ్ మద్దతుతో గ్రామంలో వైఎస్సార్‌సీపీకి మరింత బలం పెరిగిందని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. తలమంచి గ్రామంలో పర్యటిస్తున్న చలపతిరావును కల్యాణ్ కలిసి వైఎస్సార్‌సీపీకి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ కల్యాణ్ తండ్రి జొన్నా వెంకయ్య గ్రామంలో పేరు ప్రతిష్టలు కలిగిన వ్యక్తి కావడంతో పాటు ఎమ్మెల్యే ప్రసన్నకు అత్యంత సన్నిహితుడన్నారు. వెంకయ్య మృతిచెందాక ఆయన కుమారుడు హైదరాబాద్‌లో పారిశ్రామికవేత్తగా స్థిరపడ్డారని తెలిపారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ఆయన గ్రామానికి వచ్చినట్లు తెలిపారు.

ఇస్కపాళెంలో విస్తృత ప్రచారం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ పరిధిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పల్లప్రోలు, గొల్లపాళెం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, కోవూరులో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మరోసారి విజయం సాధించడం తథ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పేదలందరికీ మంచి జరుగుతుందని, టీడీపీ అధికారంలోకి వస్తే పేదలు కష్టాలు పడటం ఖాయమన్నారు. కార్యక్రమంలో కొక్కిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, పి.ఆదిశేషయ్య, కిరణ్‌కుమార్, ప్రసాద్, శ్రావణ్‌కుమార్, అశోక్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన నిమ్మ ధరలు



మార్కెట్‌కు వచ్చిన కాయలు

- పడిలేస్తున్న మార్కెట్



నిమ్మకాయలను లారీలోకి లోడ్ చేస్తున్న కూలీలు

పొదలకూరు : జలయజ్ఞంలో తవ్వించిన కాలువల నీరు, బోర్లలో పుష్కలంగా లభ్యమవుతున్న జలాలతో మెట్టప్రాంత రైతులు నిమ్మతోటలను కాపాడుకుంటూ దిగుబడులు పెంచుకుంటున్నారు. ఫలితంగా గతేడాదితో పోల్చిచూస్తే కాయల ధరల్లో వ్యత్యాసం కనపడుతోంది. ఏప్రిల్ చివరి వారం వరకు ఆశించిన స్థాయిలో కాయల ధరలు పెరగలేదు. గత నాలుగు రోజులుగా వరుసగా ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం లూజు(బస్తా) ధరలు ఒక్కటింటికి రూ.7,200 నుంచి 8,800 వరకు పలుకుతున్నాయి. కిలోల లెక్కన చూస్తే రూ.90 నుంచి రూ.110 అమ్ముడుపోతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో టాప్ రూ.6 వేలు మాత్రమే ధరలు పలికాయి. పొదలకూరు, గూడూరు నిమ్మ మార్కెట్ల నుంచే ప్రతినిత్యం 25 లారీల కాయలు ఎగుమతి అవుతుంటాయి. అలాగే తెనాలి, ఏలూరు, రాజమండ్రి మార్కెట్ల నుంచే కాగా రాయలసీమ జిల్లాల్లోని చిన్నచిన్న మార్కెట్ల నుంచి నిమ్మకాయలు ఎగుమతి అవుతున్నాయి.

తగ్గిన ఎగుమతులు

నిమ్మకాయల ఎగుమతులు వారం రోజులుగా తగ్గాయి. తోటల్లో కాయలు బాగా తగ్గిపోవడం వేసవి తాపం పెరగడంతో ఢిల్లీ మార్కెట్లో కాయలకు డిమాండ్ పెరిగింది. ఏపీ, తెలంగాణ నుంచే కాక బయటి రాష్ట్రాల నుంచి కూడా కాయల ఎగుమతులు తగ్గడం వల్ల ధరలు అమాంతం పెరిగినట్లు వ్యాపారులు వెల్లడించారు. ప్రతినిత్యం అన్ని ప్రాంతాల నుంచి సుమారు వంద లారీల్లో కాయలు ఎగుమతి అవుతుండగా ప్రస్తుతం 50 లారీల్లోనే కాయలను పంపుతున్నారు. తోటల్లో కాయలు పెరిగేంత వరకు ధరలు తగ్గకున్నా స్థిరంగా ఉంటాయని తెలుస్తోంది. ఉత్తర భారతదేశంలోని ఢిల్లీతో పాటు, లక్నో, వారణాశి, మధుర, గోరఖ్‌పూర్, అలహాబాద్ తదితర ప్రాంతాలకు కాయల ఎగుమతి చేస్తున్నారు. అయితే ఫ్యాక్టరీలకు కాయలు వెళ్లడం లేదు. కేవలం ఇళ్లలో వాడుకలకు, శీతల పానియాలు సేవించేందుకు మాత్రమే నిమ్మకాయలను ప్రస్తుత వేసవి సీజన్లో వినియోగిస్తున్నారు.

సీతారాములకు పారువేట ఉత్సవం



సీతారాముల గ్రామోత్సవం

పొదలకూరు : పట్టణంలోని శ్రీరామమందిరం వద్ద నవమి వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి పారువేట ఉత్సవం వైభవంగా జరిగింది. తుమ్మల పెంచలయ్య-కొండలమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం 12 గంటలకు సహస్రనామార్చన, తీర్థప్రసాదాల వినియోగం జరిగింది. పారువేట మహోత్సవం తర్వాత సీతారాముల గ్రామోత్సవం జరిగింది. మహిళా భక్తులు కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన పండరి భజన భక్తులను ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో తుమ్మల శ్రీనివాసులు, రమణయ్య, ప్రసాద్, శ్రీహరి, వెంకటకిశోర్, నరేంద్ర వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పొదలకూరు : పార్టీలో చేరిన వారితో మంత్రి కాకాణి



మనుబోలు : మంత్రి కాకాణితో జట్లకొండూరు నాయకులు

పొదలకూరు : మండలంలోని వావింటపర్తి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన 10 కుటుంబాలు శుక్రవారం నెల్లూరులోని మంత్రి కాకాణి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదారంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో కొత్తగా చేరిన వారికి సముచిత స్థానం ఇస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కలవకూరు రమేష్‌నాయుడు, నెట్టెం భాస్కర్‌నాయుడు, అయితా రమేష్, షేక్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జట్లకొండూరులో మెజారిటీ సాధిస్తాం

మనుబోలు : రానున్న ఎన్నికల్లో మండలంలోని జట్లకొండూరు పంచాయతీలో 500 మెజారిటీ సాధిస్తామని ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం అన్నారు. ఇటీవల జట్లకొండూరు గ్రామానికి చెందిన ముఖ్య నాయకుడు వైఎస్సార్‌సీపీని వీడిన నేపథ్యంలో శుక్రవారం 50 మందితో కలిసి నెల్లూరులో మంత్రి కాకాణిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా తులసీరాం మాట్లాడుతూ మంత్రి కాకాణికి మండలంలోనే అత్యధిక మెజారిటీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పచ్చిపాల రామచంద్రారెడ్డి, ఆవుల రమేష్, శ్రీనివాసులురెడ్డి, జగదీష్, వెంకయ్య, రఘురామయ్య, వెంకటేశ్వర్లు, రాజగోపాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.